చీకటితోనే అయిదు గంటలకు నిద్రలేచింది రుక్మిణి. ఎదురుగావున్న కృష్ణుని ఫొటోకి చేతులుజోడించినమస్కరించింది. ఆ తరువాత మంగళసూత్రాలు పైటలోనుంచి పైకి తీసి కళ్లకద్దుకుంది.

అంతవరకు భక్తిభావంతో తేలికైన మనసు నిత్యకృత్యాలు తలపుకు రాగానే బరువెక్కింది. అయినా తప్పుతుందా? తడబడే అడుగులతో గది దాటి వంటింటిలో ప్రవేశించింది.

కిరసనాయిలు లేక దాహంతో దిక్కులు చూస్తున్నాయి స్టౌలు. "నన్నెపుడో మూలపారేసావు. నా మనసెపుడో తుప్పుపట్టిపోయింది. ఇపుడా నాతో నీకవసరం?"అని మూలగూట్లో ఉన్న కుంపటి ప్రశ్నించింది. "లేదులేవే తుఫాను. ఈ వానల్లో బొగ్గులు అడితీల్లోకి రావడం లేదట. కాస్తో కూస్తో ఉన్నవి ఖరీదు హెచ్చుపెట్టగలవారి కోసం దాచేస్తున్నారు. ఇపుడు నీ గుండెల్లో మంటపెట్టనులే" .... ...అనుకుంటూ వంటింటి నానుకొని ఉన్న చిన్న వసారాలోకి నడిచింది.

అక్కడ నీళ్లుకాచుకొనే పుల్లల పొయ్యివుంది. కిరసనాయిలు, బొగ్గులు కూడా సరిగా దొరకని కారణంగా పుల్లలు తెచ్చిపడేసాడు రంగారావు. అవీ వానల మూలంగా తడి ముద్దలుగా ఉన్నాయి. అయినా తప్పుతుందా? ఎంతో అవస్తపడి నీళ్లపొయ్యి రాజేసింది రుక్మిణి.


అంతలో ఆమె పెద్దకొడుకు గోపి లేచి పెరట్లోకి వచ్చాడు. అతను ఉదయమే కాలేజీకి వెళ్లిపోవాలి.

"అమ్మా! టిఫెనేం చెయ్యవా?"అన్నాడు పందుంపుల్ల నోట్లోపెట్టుకుంటూ. వేపపుల్ల సమంగానే నోట్లో చేదుచూపించింది. తుబుక్కున ఉమ్మి అమ్మకేసి చూసాడు.

"టిఫెనేంటి నాముఖం, కిరసనాయిల్ దొరక్క చస్తుంటే. ఈ పొయ్యిరాజుకుని ఏడిస్తే- కాసిని బొగ్గులురాల్తే కుంపట్లోపోసి కాఫీ చేద్దా మనుకుంటున్నాను. ఈ తంతు అయేసరికి కాలేజీకి టైము అయిపోతుంది. ఈవేల్టికి తరవాణీ అన్నం తిని వెళ్లు." అంది. పొగకి కళ్లు మండుతుంటె తుడుచుకుంది. కళ్లమ్మట ముక్కమ్మట నీళ్లుకారుతున్నాయి. ఆమె కళ్లు, ముఖం ఎర్రగా అయిపోయాయి.

"ప్రొద్దుటే చలిలో చద్దన్నం ఏంటమ్మా? ఓ పావలా వుంటే పడెయ్యి."అన్నాడు.

ఆమె లేచి వంటింటిలోకెళ్లి డబ్బాలో దాచిన చిల్లర తీసి ఇచ్చింది. ఆ ప్రక్కనే ఉన్న పంచదార డబ్బాతీసి చూసింది. అదీ నిండుకుంది. "అయ్యో మర్చిపోయాను పంచదార నిన్ననే అయిపోయిందిరా. ఇపుడెలా? తెల్లారి లేచింది లగాయితూ అన్నింటికీ దరిద్రమే కదా. అన్నింటికీ ఏడవక తప్పదుకదా. దిక్కుమాలిన యుద్ధాలు. దిక్కుమాలిన కరువు. ఎవడికో ఒకడికి బుర్ర బుద్ధిలేక యుద్ధాలు ప్రారంభిస్తాడు. వాడి బుర్రలో దూరిన దుర్మార్గం అంటు వ్యాధిలా ప్రాకి నాలాంటి వాళ్లదాకా వస్తుంది చంపడానికి. అదేమంచి వాడి బుర్రలోని మంచి నాలుగు ప్రక్కలా వ్యాపించి నాలాంటి వాళ్లని బ్రతికించదు సరికదా దుర్మార్గుల్లోని దుర్మార్గం పెరిగిపోవడానికి ఎరువులా పనికొస్తుంది. ఛీ... ఛీ... ఎలా బ్రతకాలో ఎలా చావాలో తెలియడం లేదు."




చిరాకు పడిపోతూ మళ్లాపొయ్యిదగ్గరికి చేరింది రుక్మిణి. ఎలాగో అవస్థపడి భర్తకి, చిన్నాడికి నీళ్లు కాస్త వెచ్చబడ్డాయనిపించింది. కాసిన్ని నిప్పులు రాలితే కుంపట్లో వేసి మూడే కప్పుల నీళ్లు చిన్న గిన్నెలో పోసి కాస్త బెల్లం ముక్కవేసి, 'అదీ మండిపోతుంది ధర' అని తిట్టుకుంటూ కాఫీ తయారుచేసింది.

ఈలోపల రంగారావు, టెన్త్ చదువుతున్న రెండో కుర్రాడు శేషు లేచి కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ సేవించారు. ఆ నీళ్లపొయ్యిమీదే తంటాలుపడి అన్నం పులుసు చేసింది. పులుసు చేస్తుంటే ఆమె ప్రాణం విలవిల్లాడిపోయింది. చచ్చేంత ధర చింతపండుది. అందుకని ప్రతీ రోజూ చారే చేస్తుంది. ఈ రోజు కూరానారా వండడానికి పొయ్యి సహకరించదు. కాబట్టి కంది పొడుం వేసుకోవాలి. దాన్లోకి పులుసుంటేగాని రంగారావు తినడు.

డబ్బాలోని కందిపొడుం కర్చయిపోతుంటేను బాధపడింది. భర్త నిరంకుశత్వానికీ బాధపడింది. ఎలాగో భోజనాలు అయాయనిపించింది.

భర్త ఆఫీసుకు, శేషు స్కూలుకు వెళ్లిపోయారు. వంటింటి పని ముగించి గదిలోకొచ్చి ప్రక్కమీద వాలింది. వారపత్రికేదో తీసింది గాని కళ్లు మంటగా వున్నాయి. మనసు సీరియల్ మీద నిలవడం లేదు. పుస్తకం ప్రక్కనపడేసింది. కళ్లుమూసుకుంది. ఎలాఅయినా చిన్న కునుకు పడితే బాగుండును అనుకొని చాలాసేపు ప్రయత్నించింది. లాభం లేకపోయింది. ఆమె మనసు కిరసనాయిల్ మీదకే పోతోంది.

ఆమె ఉన్నది మారుమూల వీధి. ఏ సరుకులూ అమ్మకానికి సరిగా రావు. కిరసనాయిల్ బళ్లు ఎపుడోగాని రావు. అపుడపుడు రేషన్ షాపుల్లో ఇస్తున్నారు. ఆ టైములో భర్తకీ పిల్లలకీ కూడా క్యూలో నించోవడం అవడం లేదు. తాను వెళ్లి నుంచుందామంటె భర్త ఒప్పడు. ఏం



# అబిమధ్యాం రమణమ్మ?

# భారతమ్మక్కోగ్గే

చెయ్యాలో బోధపడదు. పొయ్యి ముట్టించడానికైనా కిరసనాయిల్ కావాలికదా! అమాంతం లేచింది. చిన్నపౌడరు డబ్బా. లోపలి మూత బద్దలుకొట్టింది. చీరమార్చుకుని తలుపులు తాళంవేసి పుట్టింటికి బయలుదేరింది.

మటి్రిపాలెంలో ఉన్నారు ఆమె పుట్టింటి వారు. అక్కడ కిరసనాయిల్ బళ్లు బాగానే తిరుగుతున్నాయట. "కిరసనాయిలు ఇక్కడ బాగానే దొరుకుతుంది. డబ్బు ఇస్తేకాని ఇవ్వనంది తల్లి. ఆ డబ్బు ఇయ్యడమే పట్టంలేదు.

సిక్స్ ఎ. సిటీబస్ ఎక్కింది. ముందునుంచి స్త్రీలు, వెనకనుంచి పురుషులు ఎక్కాలి. అయితే ఏం? పురుషులు వెనక నుంచి దిగరు. ముందు నుంచి ఆడవాళ్లని తోసుకుంటూనే దిగుతారు. 'ఆపాటి దానికి ఈ పద్ధతెందుకు?' అని నవ్వుకుంది. ఆ నవ్వు ఎంతోసేపు నిలవలేదు. జనాలు నిండిపోయి బెల్టుపట్టుకు నించోవడమే కష్టమైపోయింది.

తోపిడీ, వత్తిడి. గుమ్మం దగ్గరే వుంది తను. ఒంట్లోనీరసం. ప్రాణం దడదడలాడుతోంది. ఏపాటి బస్సు మలుపుతిరిగినా తను పడిపోవడం ఖాయం. తను ఒకర్తె పడిపోతే ఫరవాలేదు. తనతోపాటు మరికొందరు పడతారు. అందుకని కళ్లుమూసుకుని, రెండు చేతులతోటీ రెండు బెల్టులూ గట్టిగా పట్టుకుంది.

ఎలాగో అవస్థపడి పుట్టిల్లు చేరింది.

వాళ్లు రుక్మిణినీ, రుక్మిణి సంసారాన్ని, తీరువమాలిన సంసారమని తిట్టి, రుక్మిణికి టీ నీళ్లుపోసి, ఆ తరువాత ఆ పౌడరు డబ్బాలో కిరసనాయిల్ పోసి ఇచ్చారు. తొణికిపోతుందేమో అని డబ్బామూతకి తల్లిపాత గుడ్డలు బాగాచుట్టబెట్టి కట్టి ఇచ్చింది.

తొందరగా వెళ్లాలంటూ రుక్మిణి తిరుగు ప్రయాణమైంది. ఈ పర్యాయం బస్సులో మరీ

రద్దీ [illegible] రాపిడీ ఎక్కువైంది. ఆడమగా అంతా మమేకం అయారు. రుక్మిణిమెడ తిప్పిచూడ లేనంత జనం చుట్టూవున్నారు. తన వెనక నుంచున్నది ఒక మగాడని-అతని స్పర్శ చెబుతోంది.' ఛీ ఛీ-ఎంత జుగుప్సాకరం-'జుట్టు ముడి ఊడిపోయింది. జుట్టురేగిపోయింది. పువ్వులు రాలిపోయాయి.

'ఇలాంటి రద్దీలోనే వస్తువులు పోతాయి'అనుకుంది.'అయినా తనకేం ఉన్నాయి పోవడానికి? మట్టెలు మంగళసూత్రాలు, మట్టిగాజులు. పసుపుతాడుమీదకి ఎవరిదృష్టి పడుతుంది?' అని నవ్వుకుంది.

పాపం రుక్మిణి, ఆ పసుపుతాడుకు తూగుతున్న మంగళసూత్రాలేం తక్కువ కాదని తెలుసుకోలేకపోయింది!

ఇంటికి వచ్చి అద్దంముందుకు వెళ్లి ఊడిపోయిన జుట్టుముడి సవరించుకుంటుంటే మెడ బోసిగా కనిపించి అదిరిపోయింది.

వున్న పచ్చబంగారం కాస్తా పోయింది.

మట్టెలు, మట్టిగాజులు మిగిలాయి.

ఖరీదైన బంగారం పోయినందుకేకాక, అవి మంగళసూత్రాలు కూడా కావడంవల్ల సెంటిమెంటల్‌గా కూడా బాధపడింది.

ఇంతలో ఏదోగుర్తొచ్చి పక్కింటికి వెళ్లి "పెద్ద పిల్లాడొచ్చి తాళం అడిగాడా"ని అంది.

"లేదండీ" అన్నారు వాళ్లు.

అపుడపుడు తానెక్కడికైనా వెడితే పక్కింటికి తాళాలియడం అలవాటు. పిల్లలుగాని భర్తగాని వస్తే భోజనంచేసి బైటకి వెళ్లడంగాని, ఇంట్లో వుండటంగాని చేస్తారు. పిల్లాడు కాలేజీ నుంచి రాకుండానే తాను పుట్టింటికి వెళ్లింది. "ఇంతవరకు గోపి కాలేజీ నుంచి ఎందుకురాలేదు చెప్మా" అని కాసేపు ప్రక్కమీద దొర్లి బాధపడింది. ఆ తరువాత తెచ్చిన కిరసనాయిలు స్టౌలోపోసి కాఫీ చేసుకు తాగింది. స్టౌలో కిరసనాయిలు పోసి వెలిగిస్తుంటే తిరుపతి వెంకటేశ్వరుడుకి ఆవునెయ్యి దీపారాధన చేసినంత సంబరమయింది రుక్మిణికి.

బంగారం పోయినందుకు ఏడ్చినందువల్ల వచ్చిన తలనొప్పి కాస్త తగ్గింది. కాని తల్లి మనసు కుర్రాడింకారాలేదని తల్లడిల్లుతోంది. ఇంతలో కొందరు కాలేజీ కుర్రాళ్లు గుంపుగా వచ్చారు. రుక్మిణి అదిరిపడింది. కంగారుగా లేచి ఎదురెళ్లి "ఏంటిలా వచ్చారు–మా గోపి ఏడి?" అని అడిగింది.

"గోపికి దెబ్బలు తగిలాయండీ. ఆస్పత్రిలో వున్నాడు" అన్నాయి కొన్ని గొంతులు.

"ఆ..ఆ..ఏం జరిగింది...ఏం జరిగిందీ లోపలికొచ్చి చెప్పండి" అని గుమ్మంలోంచి తప్పుకుంది.

వాళ్లు చెప్పిన కథ సారాంశం ఇది.

బస్సు కాలేజీ స్టాప్‌లో ఆగలేదుట. మరి కొంతదూరంపోయి ఆగిందిట. అదలా దాటి వెళ్లిపోతుంటే డ్రైవరు ప్రక్కనున్న కుర్రాడు "ఆపండీ ఆపండీ"అని డ్రైవర్ వీపుమీద తట్టాడట- దాంతో అతనికి కోపం వచ్చి దూరంగా తీసుకుపోయి ఆపాడు. అందులో ఇంకా ఆడ మగ కాలేజీ కుర్రాళ్లున్నారు. వాళ్లూరుకుంటారా? డ్రైవరితో తగువడ్డారు. దాంతో అతడు, బస్సుని స్పీడ్‌గా ఎక్కడికి తీసుకుపోవాలో అక్కడికి తీసుకుపోయి ఆపాడు.

అక్కడ బస్సు డ్రైవర్ కీ, కాలేజీ కుర్రాళ్లకీ ఘర్షణ జరిగింది. ఆడమగ భేదం లేకుండా కుర్రాళ్లు దెబ్బలు తిన్నారు. అందులో ఓ ఆడపిల్లకి దెబ్బలు తగలకుండా వుండాలని గోపి అడ్డువెళ్లి ఆ దెబ్బలు తిన్నాడు. అంతా మొత్తం ఆస్పత్రిలో ఉన్నారు.

"అయ్యోరామా..అయ్యో కృష్ణా...ఈ రోజు లేచి ఎవరిముఖం చూసాను తండ్రీ" అని రోదిస్తూ ఆదరాబాదరా తాళంవేసి ప్రక్కవాళ్లకిచ్చి, ఆస్పత్రికి బయలుదేరింది రుక్మిణి. దెబ్బలతో ఒళ్లు తెలియకుండా పడి వున్నాడు. కొడుకును చూడగానే దుఃఖం పొంగిపొర్లింది.

ఫరవాలేదన్నారు డాక్టర్లు.

కాస్సేపక్కడవుండి, ఈవార్త భర్తకి చెబుదామని ఆదరా బాదరా భర్త ఆఫీసుకు వచ్చింది. అతడూ ఆ వార్తవిని ఆదరాబాదరా పరుగుతీస్తుంటే స్కూటర్ ఏక్సిడెంట్ జరిగి ప్రక్కనేవున్న రైల్వే ఆస్పత్రిలో పడేసామని చెప్పారు అక్కడి వాళ్లు.

మతిపోయినట్లయింది రుక్మిణికి. ఆపదలన్నీ కట్టకట్టుకుని ఒకసారేవచ్చిపడ్డాయని ఒణికిపోతూ ఆసుపత్రికొచ్చిపడింది. రంగారావుకి వొంటిమీద ఆట్టేదెబ్బలు తగలలేదు. ప్రక్కకి తుళ్లిపడిపోవడంలో తలకే బలమైన దెబ్బ తగిలింది. తెలివిలేదు.

"స్కూటరు వాలా దూసుకుపోయి ప్రక్కసందులోకి తిరిగి సినిమాహాల్లోకి దూరిపోయాడు.

సినిమాహాలువద్ద స్కూటర్ల వరసలో-ఏ స్కూటరు దుర్మార్గం చేసిందని పోల్చడం?" అని చెప్పారు అక్కడి వాళ్లు.

ఆసుపత్రిలో చేయవలసినవన్నీ చేసారు. ఇంకాచేయవలసినవి- చేస్తున్నారు.

తెలివి తప్పిన భర్తకేసి దీనురాలై చూస్తూ-ఏడ్చి,ఏడ్చి డాక్టర్స్‌ని, సిస్టర్స్‌ని ప్రార్థించి-ఇంటిముఖం పట్టింది.

ఆమె కళ్లుతుడుచుకుని తడబడే అడుగులతో ఆసుపత్రి దాటుతుంటే-తోటీ నవ్వాడు. ఆయా దగ్గరకొచ్చి అంది- "ప్రార్థనలకి వరాలెవ్వరూ ఇయ్యరమ్మా, తేవలసినది తెచ్చి పనులు జరిపించుకో-"అంది.

అర్థం అయింది రుక్మిణికి. అప్రయత్నంగా చేయి మెడని తడుముకుంది. తాడులేదు. మంగళసూత్రాలు పోయాక, తాడు పేని పసుపుకొమ్మైనా కట్టుక్కోలేదని గుర్తొచ్చింది. తడబడే అడుగుల వేగాన్ని పెంచింది.

దారిలో చిన్న కొడుకు ఎదురొస్తే వాణ్ణి అన్నగారి దగ్గర ఆసుపత్రిలో కనిపెట్టుకు వుండ

## కథారచయితలకు ఓ సమస్య

రుడ్‌యార్డ్ కిప్లింగ్ అనే ఆంగ్ల రచయిత యిలా అన్నాడు—

**The Silliest woman can manage a clever man, but it needs a clever woman to manage a fool.**

ఎంత తెలివితక్కువ ఆడదైనా చాలా తెలివైన పురుషుడ్ని అదుపులో పెట్టగలదు, కాని ఒక తెలివితక్కువవాడితో వ్యవహరించడానికి బాగా తెలివైన ఆడది కావాలి!

* * *

ఈ సమస్యపై చిన్న కథలను రచయితల నుంచి ఆహ్వానిస్తున్నాము. చాలా చక్కని కథ రాసినవారికి కవిసమ్రాట్ విశ్వనాథవారి రచనల సెట్ బహూకరిస్తాము.

—ఎడిటర్

మంది. భర్త దగ్గర ఆఫీసుకుచెందిన మనిషి వున్నాడు.

ఇంటికొచ్చి డబ్బు ఏర్పాటేదైనా చేసుకుని తిరిగి వద్దామని ఆమె తాపత్రయం.

మేల్ వార్డులో ఆడవాళ్లని వుండనీయరని తెలిసినా బ్రతిమాలుకుని ఎలాగో వుందామని ఆమె తాపత్రయం.

శవాకారంతో ఇంటికొచ్చి చేరింది.

తలుపులోపలవేసి వుంది. 'లోపల ఎవరు చెప్మా?' అని తలుపు తట్టింది.

ఇంట్లో రెండో అక్కభర్త రాజారావు వచ్చి వున్నాడు. అతడే తలుపు తీసాడు. తిరిగి వచ్చి మంచంమీద కూర్చుని విలాసంగా సిగరెట్టు కాలుస్తున్నాడు.

బావగారిని చూస్తూనే 'రుక్మిణి' ఘొల్లు మంది.

"బావా నాకొంప మునిగిపోయింది బావా" అని దుఃఖావేశంలో వుచితానుచితాలు మరిచి అతని కాళ్లదగ్గర చతికిలబడి ఒళ్లో తలవాల్చింది.

అతని ముఖంలో సంతోషరేక తళుకుమని క్షణం మెరిసి మాయమవడం రుక్మిణి చూడ్డం సాధ్యం కాలేదు.

రెండు చేతులతో ఆమె జబ్బలుపట్టి లేవదీస్తూ "ఏం జరిగింది రుక్కూ!" అన్నాడు.

అతని చేతిలో కాలుతున్న సిగరెట్టు ఒక జబ్బని చురుకుమనిపిస్తే-రెండో జబ్బుని, హద్దు దాటి అతని చేతివ్రేళ్లు చురుక్కుమనిపించాయి.

ఉలిక్కిపడిలేచి నాలుగడుగులు వెనక్కివేసి గోడని జారగిలబడి అతని ముఖంలోకి పరిశీలనగా చూసింది-అతని ముఖంలో సహజంగా వుండవలసిన ఆదుర్దా లేదు-విస్తూపోతూ కొయ్య బొమ్మలా చూస్తూ నిలబడిపోయింది. అది గ్రహించి-అతను తడబాటు కప్పిపుచ్చుకుంటూ–

"ఏంజరిగిందో వివరంగా చెప్పు రుక్కూ! చెప్పందే ఎలా తెలుస్తుంది?" అన్నాడు.

క్షణం ఆగి బెక్కుతూనే జరిగిందంతా చెప్పింది.

"బావా! కడుపుకీ, వీపుకీ, ఒకేసారి దెబ్బ తగిలింది. దేన్ని రక్షించుకోవాలో ఎలా రక్షించుకోవాలో బోధపడ్డంలేదు.

నాదగ్గర చూస్తే చిల్లిగవ్వ లేదు. వున్న మంగళసూత్రాలు ఇవ్వాళే బస్సులో ఎవరో కత్తిరించేసాడు." అంది. దీర్ఘంగా నిట్టూర్చి.

కాసేపాగి సందేహిస్తూనే అడిగింది–

## ఇంద్రజాలం

ఎవడో ఇరవయ్యో శతాబ్దపు భక్తుడు
గుడిఘంట మ్రోగించాడు
దూరాన నాకు వినిపించింది
ఆ ముసలి దేవాలయం దగ్గుతోంది
రాళ్ళు ఊడిపోయాయి అక్కడక్కడా
దంతాల్లా
మనిషి కష్టాలుతీర్చే శక్తి ఎవరో
మనిషి ఇంకా వెతుకుతూనే ఉన్నాడు

** ** **

ఓ బిడ్డా నీవు ఎగరేశిన జేబురుమాలు
పక్షులతో కలిసి ఎగురుతోంది ఆకాశంమీద
ఇంద్రధనుస్సు తీరాల్లో నివశించే దేవతలు
ఆశీస్సులు కురిపిస్తున్నారు నీ స్వప్నాల మీద

* * *

వాజెదు పూలతో వసంతాన్నితెచ్చిన నాప్రేయసి
నా గదిలోకి వచ్చిన నక్షత్రాల రోదసి
ద్రవ్యరూపంతో పానశాలచేరిన ద్రాక్షానివాసి
నేను ఎదుర్కోలేని మధురాతి మధుర రాక్షసి

***

బట్టలుతికే మానవుడు
మానవుల స్వప్నాల్నికూడా ఉతుకుతున్నాడు
స్వప్నాలు జలాల్లో కలుస్తాయి
రేవులు గ్రామాల్ని పిలుస్తాయి

* * *

నీవు త్రాగే కాఫీలోకి
పంచదార వినుకునై రాలుతాను
నీ గుండె అనే వాజులోకి
ఒక పువ్వునై చేరుతాను
నీవు కన్నెత్తి చూడకుంటే
పద్యమనే పది అంతస్తుల మేడ ఎక్కి
భూమి మీదికి దూకుతాను

***

మనుషులంతా ఒకటే కావచ్చు
కానీ నేత్రాలన్నీ ఒకటి కావు
అన్ని నేత్రాలకూ కనిపిస్తుంది వస్తుజాలం
కానీ కొన్నిటికే కనిపిస్తుంది
వాటిలో కవిత్వమనే ఇంద్రజాలం

— శేషేంద్ర

"బావా! నువ్వు దేముళ్లా సమయాని కొచ్చావు. భాగ్యవంతుడివి. చాలా కష్టంలో వున్నాను. నువ్వీసమయంలో సహాయంచేస్తే జన్మ జన్మలకూ నీకు ఋణపడి వుంటాను."

చిన్నగా నవ్వాడు రాజారావు.

"ఋణపడే వుంటానంటావుగాని ఋణం తీరుస్తానవుకదా ఎన్నాళ్లయినా. నీ దగ్గర చిల్లిగవ్వయినా లేదన్నావు. వున్నదే వెచ్చించుకుని నీవారిని రక్షించుకో. నేను ఊరికే సహాయం చేసేవాడిని కాదని నీకు బాగా తెలుసు."

కానిసమయంలోకూడా అతని కోరికకి, కాఠిన్యానికి విస్తుబోయింది. కోపం, రోషం, పౌరుషం ముంచుకొచ్చాయి. కోపాన్ని పంటికీ, పెదవికీ మధ్య నొక్కిపట్టి అంది-

"ఈ కాని సమయంలో కూడా నీకు కోరికలు ఎలా పుడుతున్నాయి బావా?" అంది.

'నువ్వు మనిషివా పశువ్వా!' అన్నమాట గొంతుదాకా వచ్చి ఆగిపోయింది.

"కోరికలకి సమయా సమయాలేమిటి రుక్కూ? నీతులు నియమాలు మనుషులకి. కోరికకి కాదు."

'నువ్వు మనిషివి కాదా' అనబోయి సమ్మళించుకుని-

"నువ్వు మనిషివేనా" అంది.

"మనిషిని కాబట్టే కోరికలు" అన్నాడు నవ్వుతూ.

ఆ నవ్వు ఎంతో అసహ్యాన్ని కలిగించింది రుక్మిణికి. అక్కడిహ క్షణం నిలబడలేకపోయింది. దుర్మార్గుడా అని మనసులో తిట్టుకుంటూ విసావిసా తనగదిలోకి పోయి తలుపులు గడియపెట్టి మంచంమీద వాలిపోయింది.

దుఃఖం కారుమొయిల్లా కమ్ముకొచ్చి ఆమె కంటికాటుకైంది. కడలిలా మనసులో పొంగి కళ్లలోంచి పార్లిపోతోంది.

ఆమె తలపులలో సాగుతున్న గతం:

ఆ గుండె కడలి ఘోష మనం వింటే?

ఆమె అపురూపంగా అయిదుగురు మొగపిల్లల తరువాత పుట్టిన రుక్మిణీదేవిలాంటిది కాదు. అయిదుగురు ఆడపిల్లల తరువాత సామాన్య సంసారికి పుట్టిన ఆరవ ఆడపిల్ల. పేరుకు మాత్రమే రుక్మిణి.

పై అయిదుగురి పెళ్ళిళ్లు చేసేసరికే ప్రాణం కడంటి, కాళ్లు చేతులు చల్లబడినంత పనయింది తండ్రికి. ఇహతన పెళ్లిమాట తల పెట్టడానికే భయపడేవాడు తండ్రి. తను కాలేజీ

నుంచి కాస్త ఆలస్యంగా వస్తే "అమ్మాయి యింకా రాలేదా?" అని తండ్రి ఆదుర్దాగా అడిగేవాడు. "మీ అమ్మాయినెవరూ ఎత్తుకుపోరండీ. అయినా మీ అమ్మాయి సంగతి మీకు తెలియదూ?" అనేది తల్లి విసుగ్గా. "ఎత్తుకుపోతారని కాదే, ఎత్తుకుపోవాలనే చూస్తున్నాను. రుక్మిణి పేరుపెట్టినందుకు ఏ కృష్ణపరమాత్మయినా కనికరించి శ్రీకృష్ణుల్లాంటి కుర్రాణ్ణి పంపి, దాన్ని ఎత్తుకుపోయి పెళ్లిచేసుకునేలా చేస్తే బాగుంటుందని అనుకుంటున్నానే. కట్నం ఇయ్యలేని ఈ తండ్రి సంతోషిస్తాడే. నేనెదురు చూస్తుంట ఆ శుభ సమయంకోసం గాని, అమ్మాయికోసంకాదు." అనేవాడు తండ్రి.

వారి సంభాషణలు వింటుంటే ఏడవాలో నవ్వాలో తెలిసేదికాదు. తన మనసుకు వయసిచ్చిన వన్నెలతో మనోఫలకంమీద అందమైన చిత్రాలేగీసుకొనేది. తన మనోరథంమీద శ్రీకృష్ణుడే ఆశీనుడై ఉండేవాడు.

తన మనసులోనే ఓ శ్రీకృష్ణుణ్ణి ప్రతిష్ఠించుకొని ఆరాధించి మురిసిపోయిందికాని, బాహ్యంగా ఏకృష్ణుణ్ణీ తన దరిదాపులకు రానీయలేదు. తన తండ్రి కట్నకానుకలిచ్చి ఏ కృష్ణుణ్ణీ తేనూలేదు, తనని ఏ కృష్ణుడూ వచ్చి ఎత్తుకుపోనూ లేదు.వయసు వాడిపోయాక, రెండోపెళ్లివాడైన రంగారావు కాళ్లదగ్గరకు తెచ్చిపడేసాడు కన్నతండ్రి.

అప్పటికే అతనికి ముగ్గురు ఆడపిల్లలు. వాళ్లుచాలు లేవయ్యా అంటే అతడూరుకోలేదు. "నాకు మగపిల్లలు కావాలి. నిన్ను పెళ్లి చేసుకున్నది ఎందుకనుకున్నావ్?" అన్నాడు పైగా.

## తరంగాలు

జనులు చేతివేళ్ళు సమత లేదనువాడ
ఐదువేళ్ళ చూడు అందరికిని
ఎందు భేదమున్న ఎందు పోలికలున్న
మనిషి బ్రతుక వలయు మట్టిమీద.

—కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

అతడాశించినట్లే ఇద్దరు మగపిల్లలు పుట్టారు. ఆడపిల్లలకి పెళ్లిచేసి అత్తవారింటికి పంపేసరికి తల ప్రాణం తోక్కివచ్చింది. ఆ తోకపట్టుకునే జీవితాలీదుస్తుంటే ఇపుడీ విపత్తు!

తన రెండో అక్క భర్త రాజారావు. తన వయసు మొగ్గతొడిగినప్పటి నుంచీ కోరుతూనే వున్నాడు. కవ్విస్తూనే వున్నాడు. అతని డబ్బుకి అందానికి విలాసానికి-దేనికీ తను లొంగలేదు. తనకి నలభై సంవత్సరాలు దాటి చాలా రోజులైంది. తనకి వయసుడిగిపోయింది. పైగా విపత్తులో వుంది. ఇప్పటికీ అతని కోరిక తనని వెన్నాడటం, ఈ సమయంలో వెల్లడించడం-ఎంతో జుగుప్సాకరమైన విషయం. అసలు వాడికి మనసెలాఒప్పింది?

రుక్మిణికి దుఃఖంపోయి కోపంముంచుకొచ్చింది. కోపంవదిలి, రోషం వచ్చింది. మంచంమీదనుంచి లేచింది. పెదవి కొరుకుంటూ ఒకడుగు ముందుకువేసి ఆగిపోయింది. 'పేదవాని కోపం పెదవికి చేటు. ఇపుడు సమయం అమూల్యం. భర్త,బిడ్డ ప్రమాదస్థితిలో ఉన్నారు. వారిద్దరూ తనకి రెండు కళ్లు. వారిని కాపాడ్డానికి తన సర్వం ధారపోయాలి-తన శాయశక్తులా తంటాలుపడాలి. ఆలోచించడానికి కూడా సమయం లేదు. తన పవిత్ర తులసిదళంతో భర్తని తూచాలి. తప్పదు అలా అయినా భర్తదక్కుతాడో లేదో-'దీర్ఘంగా నిట్టూర్చింది.

ఆమె మనసులోకి ఒక నిశ్చయం వచ్చింది.

ఆమె అద్దం ముందు కొచ్చింది.

ముఖం తెల్లగా పాలిపోయివుంది. కళ్లు ఎఱ్ఱ కలువల్లా వున్నాయి. కసితో కళ్లకాంతి జ్యోతిలా వెలిగిపోతోంది.

వెంటనే తలదువ్వుకొంది. తెల్లచీర కట్టింది. చేతిలో పౌడరువేసుకొంది. తెల్లముఖం. తెల్లని పౌడరు. తెల్లచీర-తనువు మనసు దేనికో దడదడలాడాయి. కుంకుమ భరిణి చేయిజారి క్రింద పడింది. తీసే ఓపికా టైమూ లేవు. తిలకం దిద్దింది-ముందు గదిలోకడుగుపెట్టింది.

ఆ స్థితిలో—


రుక్మిణి దెయ్యంలా కనిపించింది రాజారావుకి. రుక్మిణికి రాజారావు మృత్యుదేవతలా కనిపించాడు. అతని మనసు జంకుతో వెనకంజవేస్తోంది. రుక్మిణి ముందంజ వేస్తోంది.

... ... ...

ఆ రాత్రి తెల్లవారదనుకుంది రుక్మిణి. కాని తెల్లవారింది.

మంగళసూత్రాలు పోయినా, కుంకుమ భరిణి జారినా-తులసి దళంలాంటి. తనలోని పవిత్రతను తుంచి భర్తను తూచగలిగింది. కాని కొంగున కట్టుకున్నదానితో కొడుకును కాపాడుకోలేకపోయింది.

రుక్మిణికి ఒకటి దక్కింది. ఒకటి పోయింది.



## ప్రిక్లీహీట్ పౌడర్ అంటే?

చెమటకాయలు యెందుకు వస్తాయి? వాటికి ఉపశమనం యేమిటి? అని చాలా సంవత్సరాల పాటు పరిశోధనలు జరిగాయి. చర్మం క్రింద ఉండే చెమట గ్రంథుల వాపు వల్ల చెమట పొక్కులు వస్తాయని నిపుణులు నిర్ధారించారు. దీనినే వైద్యశాస్త్ర పరిభాషలో "మిలియేరియారుబ్రా" అంటారు. చెమట పొక్కులు లేక పేలడం అనే యీ రుగ్మత వేసవి కాలంలో వస్తుంది. వేసవి వేడివల్ల, వాతావరణంలో తేమ లేకపోవడం వల్ల యిలా జరుగుతుంది.

మన కంటికి కనిపించే చర్మంలో రెండు ప్రధానమైన పొరలుంటాయి. అవి బహిశ్చర్మం, అంతశ్చర్మం. బహిశ్చర్మం మనకు తెలీకుండా అరిగిపోయి కొత్త పొర ఏర్పడుతూంటుంది. ఇది ఒక సహజ ప్రక్రియ. అంతశ్చర్మం లోపల చెమట గ్రంథులున్నాయి. అవి చెమటనుత్పత్తి చేసి చర్మం వెలుపలకు పంపిస్తాయి. అక్కడ నుంచి అది ఆవిరైపోతుంది. ఒక్కొక్కసారి యీ ప్రక్రియలో అవరోధాలు వస్తాయి. చెమట ఆవిరి కాక చర్మంపై బిందువుగా వుండిపోయి పొక్కుగా వస్తుంది. అవే చెమట పొక్కులు. అయినంటే చెమ్మపోట బాక్టీరియా విపరీతంగా పెరుగుతుంది. దానితో ఆ ప్రదేశం ఎర్రగా మారుతుంది. దీనినే మనం పేలడం అంటాం.

చెమట పొక్కుల నివారణకై అనేక రకాల పౌడర్లున్నాయి. వీటిలో ప్రధాన రసాయనం 'సార్బాలిక్ ఆమ్లం.' ఇది చర్మానికి అంటిపెట్టుకొని వుండే చెమటని పీల్చేటట్లు చేస్తుంది. అందుచేత 'ప్రిక్లీహీట్ పౌడర్' రాసుకొంటే చెమట పొక్కులు రాకుండా నివారించుకోవచ్చు. చెమట పొక్కుల గురించి, వాటి నివారణ గురించి రాబిన్‌సన్ (1884) పొలిజర్ (1893)లు ఎక్కువ కృషి చేశారు. వారి పరిశోధనల ఫలితమే ఈనాటి ప్రిక్లీహీట్ పౌడర్లు.

డాక్టర్ హెచ్.జె. షరాఫ్